# అదుపు తప్పితే.. అంతే

- రోడ్ల పక్కనే వ్యవసాయబావులు
- సూచిక బోర్డులు, రక్షణ చర్యలు చేపట్టని వైనం
- మలుపుల వద్ద కానరాని రెయిలింగ్
- వాహనదారులకు పొంచి ఉన్న ముప్పు
- పట్టించుకోని అధికారులు



దస్తురాబాద్ కుమురంభీం చౌరస్తా రోడ్డు వద్ద..



పెర్కపల్లి సమీపంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా బావి

దస్తురాబాద్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. రోడ్ల పక్కన వ్యవసాయ బావులు ఉండటం.. మలుపుల వద్ద రెయిలింగ్ ఏర్పాటు చేయకపోవడంతో తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి రోడ్ల వెంట ఉన్న బావులను పూడ్చివేయడంతోపాటు మలుపుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని అయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

**కలమడుగు–పాండ్వాపూర్ వెళ్లే మార్గంలో..**

మండలంలోని కలమడుగు నుంచి పాండ్వాపూర్ వెళ్లే మార్గంలో డబుల్ రోడ్డు కావడంతో వాహనాలు వేగంతో దూసుకెళ్తున్నాయి. ఈ మార్గంలో పెర్కపల్లె సమీపంలో మూడు వ్యవసాయ బావులు, మున్యాల గ్రామ సమీపంలో రెండు వ్యవసాయబావులు, రేవోజీపేట గ్రామసమీపంలో మూడు వ్యవసాయ బావులు, బుట్టపూర్ గ్రామ సమీపంలో మూడు వ్యవసామ బావులు రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్నాయి. వాహనదారులు ఏ మాత్రం అదుపు తప్పినా ఇందులో పడిపోయే ప్రమాదం ఉంది.

**మలుపుల వద్ద కానరాని రక్షణ..**

పాండ్వాపూర్–కలమడుగు రోడ్డు మార్గంలో ఉన్న మలుపుల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. దస్తురాబాద్ మండల కేంద్రంలో కుమురంభీం చౌరస్తా వద్ద ప్రధాన రోడ్డుపై ఉన్న మలుపు వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. రోడ్డును అనుకొని చెట్లు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

పెర్కపల్లె ప్రాథమిక పాఠశాలతోపాటు మున్యాల, రేవోజీపేట, బుట్టాపూర్ గ్రామాల్లో ఉన్న మలుపుల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు.

**అధికారులు స్పందించాలి..**

రోడ్ల పక్కన వ్యవసాయ బావులు, మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా ఆర్అండ్బీ అధికారులు సెఫ్టీ రాడ్లు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాల్సి ఉంటుంది.. కానీ ఇప్పటివరకు అధికారులెవరూ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

### రక్షణ చర్యలు చేపట్టాలి



ప్రమాదాలు జరగకుండా రోడ్ల పక్కన ఉన్న వ్యవసాయ బావులు, మూల మలుపుల వద్ద సెఫ్టీ రాడ్లను ఏర్పాటు చేయాలి. తరచుగా ప్రమాదాలు జరిగే చోట బోర్డులు ఏర్పాటు చేస్తే డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటారు.

– భూక్య రమేశ్, ఎర్రగుంటవాసి

### సమస్య పరిష్కరిస్తాం

కలమడుగు–పాండ్వాపూర్ రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపడుతాం. వ్యవసాయబావులు, మూల మలుపులపై సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. రక్షణ చర్యలు చేపట్టి త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

– మల్లారెడ్డి, ఆర్అండ్బీ డీఈ

## క్లుప్తంగా

### 10న పెరిక కులస్తుల సమావేశం

కడెం: మండలంలోని కొండూకూరు గ్రామ ఫంక్షన్హాల్లో ఈనెల 10న ఆదివారం పెరిక కుల సంఘం జిల్లా సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం కొండూకూరులో పెరిక కులస్తులు మాట్లాడారు. సమావేశంలో జిల్లా, మండలాల కార్యవర్గాలను ఎన్నుకుంటామన్నారు. పెరిక కులస్తులు సమావేశానికి తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోళ్ల వేణుగోపాల్, ముక్కెర శ్రీనివాస్, మల్లేశ్, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులున్నారు.

### అందుబాటులో యూరియా

ముధోల్: ముధోల్, బాసర పీఏసీఎస్ కార్యాలయాల్లో రైతులకు అందుబాటులో యూరియా ఉందని ముధోల్ పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. అవసరం ఉన్నవారు ఆధార్, పట్టాపాసుపుస్తకంతో కార్యాలయానికి రావాలన్నారు. యూరియా బస్తా ధర రూ.267, డీఏపీ బస్తా రూ.1350, 20–20–013 బస్తా ధర రూ.1140 ఉందన్నారు.

### 14న గద్దర్ సంస్మరణ సభ



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: మండలంలోని సీఎంరావ్ ఫంక్షన్ హాలులో ఈనెల 14న ప్రజాయుద్ధనౌక గద్దర్ సంస్మరణసభ నిర్వహించనున్నట్లు దళిత, గిరిజన ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని విద్యానగర్లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సభకు ప్రజలు తరలి రావాలని కోరారు. నంది రామయ్య, వెంకట్రావు, గోవింద్, అశోక్, నవీన్, షమీ, రాజ్కుమార్, శంకర్, నర్సయ్య తదితరులున్నారు.

### కొనసాగుతున్న సర్వే

ఖానాపూర్: మండలంలోని మందపల్లి పలేక్రు వాగు మీదుగా రాజూరా వరకు వంతెన కోసం చేపట్టిన సర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం డీఈ మల్లారెడ్డి ఆధ్వర్యంలో చందునాయక్తండా నుంచి మందపల్లిలోని పెంబి రోడ్డు వరకు ఐదు కిలోమీటర్ల మేర రోడో మీటర్ ద్వారా కొలతలు తీసుకున్నారు. వారి వెంట నిమ్యా నాయక్, సిబ్బంది అశోక్ తదితరులున్నారు.


### పీఆర్టీయూతోనే సమస్యలు పరిష్కారం

తానూరు: పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణరావ్ అన్నారు. శుక్రవారం మండలంలోని భోసి, తానూరులో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలుకు పీఆర్టీయూ కృషి చేస్తోందన్నారు. ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగుల చిన్నన్న, లక్ష్మీకాంత్ సిందే, మల్లన్న, తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్లో పలువురి చేరిక

నిర్మల్చైన్గేట్: సోన్ మండలంలోని పాక్పట్ల గ్రామానికి చెందిన దినేశ్రెడ్డి, చిలుక నవీన్ ఆధ్వర్యంలో నక్కల మధుకర్రెడ్డి, సాయిరెడ్డి, పోశెట్టి, ముత్యం లింగన్న, నిర్మల్లోని మంజులపూర్ 18, 19వ వార్డులకు చెందిన రాజన్న, లింగన్న, రవి, రాజు, శ్యామ్, ప్రశాంత్ కాంగ్రెస్లో చేరారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పాడెల్లి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

### 108 కమలాలతో అభిషేకం



పూజలు చేస్తున్న భక్తులు

దస్తురాబాద్: శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మండలంలోని రేవోజీపేట గ్రామ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వంశీధారచార్యులు, మహిళల ఆధ్వర్యంలో లక్ష్మీదేవికి 108 కమల పూలతో అభిషేకం నిర్వహించారు.

### నియామకం

కడెం: రాంజీగోండ్ సేవా సమితి మండలాధ్యక్షుడిగా మండలంలోని పాండ్వపూర్లోని కాశీగూడకు చెందిన తుమ్రం తులసీరాం నియమితులయ్యారు. శుక్రవారం కడెంలోని హరితరిసార్ట్స్లో ఆయనను సేవా సమితి జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి భీంరావు శాలువాతో సన్మానించారు. తుడుం దెబ్బ మండలాధ్యక్షుడు ఆనంద్రావు, భీంరావు, గుణ్వంత్రావు, లక్ష్మణ్ ఉన్నారు.

### ఓటరుగా నమోదు చేసుకోండి

లక్ష్మణచాంద: అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కె.శ్రీలత పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఎస్వీజీ డిగ్రీ, సహకార జూనియర్ కళాశాలలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఇన్చార్జి ప్రిన్సిపాల్ కిష్టయ్య, ఆర్ఐలు శ్రీనివాస్రెడ్డి, దేవిక తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పోషకాహారంపై అవగాహన

ఖానాపూర్: అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో సరిత అన్నారు. శుక్రవారం మండలంలోని దిలావార్పూర్, కొత్తపేట అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసోత్సవానికి వారు హాజరై మాట్లాడారు. కాశవేని రాజన్న, సూపర్వైజర్లు శ్రీలత, ప్రేమలత, ఎంఎల్హెచ్పీలు రాణి, సరస్వతి, ఏఎన్ఎంలు గంగమణి, స్వప్న, అంగన్వాడీ టీచర్లు నర్మద, లక్ష్మి, మంగ, ఆశావర్కర్లు ఉన్నారు.

కుభీర్: మండలంలోని దొడర్నా అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహారంపై ఐసీడీఎస్ అధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, అంగన్వాడీ టీచర్లు జాదవ్ శాంతాబాయి, రాథోడ్ సురేఖ, సోనుబాయి శోభ తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్ : మాట్లాడుతున్న సీడీపీవో సరిత



కుభీర్: దొడర్నా అంగన్వాడీ కేంద్రంలో..

గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కుంటాల: ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ లక్ష్మి విశారద పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూరు కస్తూర్బాలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, ఏఎన్ఎం బబిత, అంగన్వాడీ టీచర్లు గంగాజ్యోతి, రాజమణి, పద్మ, సుగుణ, వనిత తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని మన్మద్, హవర్గ గ్రామాల్లో శుక్రవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ శ్రీలత మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. సర్పంచ్ శేఖర్, కార్యకర్తలు పద్మ తదితరులు ఉన్నారు.

# పరిసరాల్లో నిల్వనీటిని ఉంచొద్దు

లక్ష్మణచాంద: ప్రజలు తమ ఇళ్ల చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో నసీరుద్దిన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వీధుల్లో తిరుగుతూ ఇంటి వద్ద పాత టైర్లు, పాత కుండల్లో ఉన్న నిల్వనీటిని పారబోయించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఆశావర్కర్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

**పారిశుధ్యంపై దృష్టి సారించండి**

ముధోల్: పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఎంపీడీవో సురేశ్బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని మచ్కల్ గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిల్వ నీటిని పారబోయించారు. వారి వెంట సర్పంచ్ మైసాజీ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పొట్టపెల్లి(కే)లో నీటిని పారబోయిస్తున్న అధికారి

**బుధవార్పేట్లో పర్యటన**

నిర్మల్టౌన్: పట్టణంలోని బుధవార్పేట్ కాలనీలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పర్యటించారు. ఈసందర్భంగా రోడ్లు, డ్రెయినేజీ, ఇతర సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ హరిభువన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, కౌన్సిలర్ జగడం రాజు, మారుగొండ నరేందర్ తదితరులు ఉన్నారు.

## సంక్షిప్త వార్తలు

**ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి**

కుంటాల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని సినీ గేయ రచయిత తాటి శివ పేర్కొన్నారు. కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా కుంటాల హనుమాన్ ఆలయంలో భజన, ఏకతాళంలో వారం రోజులపాటు పాల్గొన్న భక్తులకు శుక్రవారం సన్మానం చేశారు. గ్రామపెద్దలు కల్యాణ్ గజేందర్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ**

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ గంగాధర్, ధర్మాజీ చందనే తదితరులు పాల్గొన్నారు.

**పెరటి తోటలు ఏర్పాటు చేసుకోవాలి**

లక్ష్మణచాంద: పెరటి తోటలతో తాజా కూరగాయలు లభిస్తాయని.. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద పెరటి తోటు సాగు చేసుకోవాలని ఎంపీడీవో శేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పలువురి ఇళ్ల వద్ద కూరగాయల విత్తనాలను నాటించారు. ఎంపీడీవో మాట్లాడుతూ రిలయన్స్ ఫౌండేషన్ వారు మండలంలోని 12 జీపీలకు ఉచితంగానే కూరగాయలు, ఆకుకూరల విత్తనాలను వీవోఏలకు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వోస రాజేశ్వర్, సర్పంచ్లు ముత్యంరెడ్డి, శోభారాణి, ఎంపీవో నసీరుద్దీన్, ఏపీఎం వాణిశ్రీ, సీసీ దినేశ్, ఐకేపీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**గర్భిణులకు అవగాహన**

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు సాధారణ ప్రసవాలపై పీహెచ్సీ వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రైవేటుకు వెళ్లి నష్టపోవద్దని.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలున్నాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎన్ఎంలు సుగుణ, వనిత తదితరులు పాల్గొన్నారు.

**పశుపోషకులకు అవగాహన**

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామ గోపాలమిత్ర భవనంలో శుక్రవారం పశుపోషకులకు కృత్రిమ గర్భధారణపై మండల పశువైద్యాధికారి దీప్తి అవగాహన కల్పించారు. మూడు పశువులకు గర్భధారణ ఇంజక్షన్లు ఇచ్చి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ గంగారాం, నాయకులు బి.నారాయణ, సూపర్వైజర్ గోపాల్, గోపాలమిత్రలు నర్సయ్య, వినాకర్, సిబ్బంది రమేశ్, నారాయణ, తదితరులున్నారు.

**సన్మానం**

తానూరు: మండల కేంద్రానికి చెందిన హడ్కేకర్ సాయినాథ్ కామారెడ్డిలోని మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. శుక్రవారం గ్రామస్తులు సాయినాథ్ను ఘనంగా సన్మానించారు. నిజామాబాద్ జ్యోతిబాపూలే కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన అతడు నీట్ ఫలితాల్లో సత్తా చాటాడు. మాజీ సర్పంచ్ మాధవ్రావ్ పటేల్, పుండలిక్ తదితరులు ఉన్నారు.

**'అనుచిత వ్యాఖ్యలు సరికాదు'**

లోకేశ్వరం: భైంసా వ్యవసాయ మార్కెట్ రాజేష్బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకుడు మెండె శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. భైంసాలో మార్కెట్ కమిటీ భవనం ఎదుట రాజేశ్బాబును రెచ్చగొట్టేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. దీనిపై త్వరలో బీఆర్ఎస్ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామన్నారు. చిన్నారావు, రవీందర్ రావు, కోటేశ్బాబు తదితరులున్నారు.

**రోగులకు పండ్లు పంపిణీ**

ఖానాపూర్: ఫిజియోథెరపిస్టు దినోత్సవం పురస్కరించుకొని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వంశీమాధవ్, డా.నాగరాజు, డా.హర్షిణి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్పాషా, నాయకులు అమానుల్లాఖాన్, జహీర్హైమద్, బీఆర్ఎస్ నాయకులు శోభన్ తదితరులు ఉన్నారు.

## ఈరోజు

### విద్యుత్ సరఫరా బంద్

నిర్మల్చైన్గేట్: పట్టణంలోని విశ్వనాథ్పేట్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. గాజులపేట్, బంగల్పేట్, విశ్వనాథ్పేట్ వైఎస్సార్ కాలనీ, డాక్టర్స్ లైన్ బుధవార్పేట్ నాయుడువాడ కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

**కడెం మండలంలో..**

కడెం: మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని కడెం, లింగాపూర్, బెల్లాల్ సబ్స్టేషన్ల పరిధిలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు.

**లక్ష్మణచాంద మండలంలో..**

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్, వడ్యాల్, పీచర, పార్పెల్లి సబ్స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

### నిర్మల్లో పల్లకిసేవ

నిర్మల్టౌన్: జిల్లాకేంద్రంలోని దేవరకోట దేవస్థానంలో శనివారం లక్ష్మీవేంకటేశ్వరస్వామికి పంచామృత అభిషేకం, పల్లకి సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు వికాస్ తరంగిణి సౌజన్యంతో కోటి హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

# కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు తీసుకున్నవారితో ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎమ్మెల్యే రేఖానాయక్ పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని జర్నలిస్టులు తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరగా.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని తహసీల్దార్ పరిమల్ భౌమిక్ను ఆదేశించారు.

**కచ్చితంగా బరిలో ఉంటా..**

తాను మౌనంగా ఉంటున్నానని.. పలు విధాలుగా తనపై పత్రికల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఎమ్మెల్యే ఖండించారు. తాను ఎమ్మెల్యేగా కచ్చితంగా బరిలోనే ఉంటానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు చిన్నం రవి, పడిగెల రాజశేఖర్, దాసరిగొండ మల్లయ్య, గుగ్గిల్ల సతీశ్, శ్రీదర్గౌడ్, నశీర్ హైమద్, విలాస్నాయక్ తదితరులున్నారు.

# కేసుల పరిష్కారానికే లోక్అదాలత్



కేసులు పరిష్కరిస్తున్న జడ్జి దేవేంద్రబాబు

భైంసాటౌన్: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలని భైంసా సివిల్ కోర్టు న్యాయమూర్తి డి.దేవేంద్రబాబు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కేసులను పరిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్షణికావేశంలో చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడి కేసుల పాలైనవారు లోక్అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘువీర్, ఏజీపీ సంతోష్, పలువురు కోర్టు సిబ్బంది ఉన్నారు.

# సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసన



వరలక్ష్మీ వ్రతం చేస్తున్న ఉద్యోగులు

నిర్మల్రూరల్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం చేసి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట వారు చేపట్టిన దీక్ష 12 రోజులకు చేరింది. ఈసందర్భంగా వారు కేసీఆర్కు తమ డిమాండ్లు నెరవేర్చే శక్తినివ్వాలని కోరారు. జిల్లా గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు రమణారెడ్డి, సదానందం, దశరథ్ శిబిరం సందర్శించి మద్దతు తెలిపారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు భూసారపు గంగాధర్, ఉపాధ్యక్షుడు భోజన్న, నవిత, రాధిక, ప్రధాన కార్యదర్శి రత్నం, అలేఖ్య, రాము, గజేందర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్సీలో నీటి వసతి కల్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పెంబి: మండల కేంద్రంలోని పీహెచ్సీలో నీటి సౌకర్యం కల్పించాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేపల్లి స్వామి, నాయకులు శుక్రవారం ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులు నీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. మోటార్ కాలిపోయి రెండు నెలలు గడుస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మహిళలు, చిన్నారులు, సిబ్బంది బాత్రూం వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారని వాపోయారు.

# ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు

ఖానాపూర్: పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి ఉంటానని.. ఖానాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని పెంబి జెడ్పీటీసీ సభ్యులు జానుబాయి అన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్లోని బీజేపీ కార్యాలయంలో టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతున్నట్లు తెలిపారు. ఆమె వెంట నాయకులు గోవింద్, ఉపేందర్, శ్రావణ్, స్వామి, గంగాధర్, రాజెందర్, పవన్, సాయికృష్ణ, గోపాల్రెడ్డి, రాజేశ్వర్రెడ్డి, సాయికిరణ్, శేఖర్, మల్లేశ్, నితిన్, శ్రీను, అరుణ్, తదితరులున్నారు.

**ముధోల్ అసెంబ్లీ స్థానానికి అఖిలేశ్ దరఖాస్తు**

నర్సాపూర్(జి): మండలంలోని నందన్ గ్రామానికి చెందిన బీజేపీ గిరిజన మోర్చా జిల్లా బాధ్యుడు అఖిలేశ్ జాదవ్ శుక్రవారం హైదరాబాద్లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ముధోల్ అసెంబ్లీ నుంచి పోటీ చేసేందుకు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికలలో యువతకు సముచిత స్థానం ఇవ్వాలని ఆయన కోరారు.

# తెలంగాణ భాషాదినోత్సవం



విద్యార్థికి బహుమతి అందిస్తున్న అధ్యాపకులు

భైంసాటౌన్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి పురస్కరించుకుని పట్టణంలోని జీఆర్పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ సాహిత్యంతోపాటు తెలంగాణ ఉద్యమంలో కాళోజీ పాత్ర ఎనలేనిదన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు శివప్రసాద్, గంగాధర్, సూర్యసాగర్, సుభాష్ తదితరులు ఉన్నారు.

# కనుల పండువగా కృష్ణాష్టమి వేడుకలు



నిర్మల్లోని శ్రీనగర్కాలనీలో..



దస్తురాబాద్ హనుమాన్ ఆలయం వద్ద..

నిర్మల్టౌన్: పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణుడు, గోపికమ్మ వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఉట్టిని కొట్టేందుకు యువకులు పోటీపడ్డారు. ఉట్టి కొట్టినవారికి రూ.1501 అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బొద్దుల భానుచందర్, ప్రధాన కార్యదర్శి రాకేశ్సింగ్, సాయినాథ్, రాజేశ్వర్, తిరుపతి, రాజు, మురళీధర్, భూమన్న, బ్రహ్మయ్య, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**సన్మానం**

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ప్రభాకర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. శుక్రవారం పాఠశాలలో వారిని గ్రామస్తులు సన్మానించారు. సర్పంచ్ నర్సన్న, మహేందర్ తదితరులున్నారు.